విశాఖ వేదికగా ఈనెల 14, 15 తేదీల్లో జరుగనున్న 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు పలు దేశాలకు చెందిన ప్రతినిధులతో భేటీ అయ్యారు. నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, అర్మేనియా, ఇటలీ, తైవాన్ తదితర దేశాలకు చెందిన ప్రతినిధులతో సీఎం భేటీ అయి రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయనే దానిపై చర్చించారు.

విశాఖ భవిష్యత్ నగరం

- బెస్ట్ టూరిజం డెస్టినేషన్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- నౌకాదళ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం
- వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాతో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈస్టర్న్ నావల్ కమాండ్ కమాండింగ్ ఇన్ ఛీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా భేటీ అయ్యారు. విశాఖలో సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని సంజయ్ భల్లా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నౌకాదళ కార్యకలాపాలపై వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ముఖ్యమంత్రి వివరించారు. రక్షణ వ్యవస్థలో కీలకమైన భారత నౌకాదళానికి సేవలు అందించే కంపెనీలు, స్టార్టప్‌లను రాష్ట్రానికి ఆహ్వానించే అంశంపై ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వదేశీ నౌకా నిర్మాణం, నౌకా సాంకేతికతకు తోడ్పాటును అందించేలా ప్రయత్నం చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తూర్పు నావికా దళం నిర్వహించే ఫ్లీట్ రివ్యూలకు ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖ అనేక

అవకాశాలకు, ప్రతిష్టాత్మక సంస్థలకు కేంద్రం కాబోతుందని అన్నారు. విశాఖ భవిష్యత్ నగరంగా మారుతోందని దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం, నేవీ కలసి పనిచేయాలని అన్నారు. విశాఖ నాలెడ్జ్ ఎకానమీ కేంద్రం కానుందని, ఇదే సమయంలో విశాఖను అత్యుత్తమ టూరిజం సెంటర్‌గా కూడా తీర్చిదిద్దేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి తూర్పు నావికాదళం సహకారాన్ని అందించాలని సీఎం కోరారు. నేవీ చేపట్టే వివిధ ప్రాజెక్టులకు, కార్యకలాపాలకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం చంద్రబాబు వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాకు తెలిపారు.

ఇటలీ రాయబారితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని సిఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ భేటీల్లో భాగంగా గురువారం భారతదేశంలోని ఇటలీ రాయబారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నా యనే విషయాన్ని ముఖ్యమంత్రి బార్టోలీకి వివరించారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, ఆటో విడిభాగాలు, యంత్రాల తయారీ, ఇంధన, ఫ్యాషన్, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి–ఇటలీ రాయబారి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకానిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్‌గా ఏపీ

ఐటీ కంపెనీల భూమి పూజలో మంత్రి లోకేష్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని.. వచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. విశాఖపట్నం ఐటీ హిల్స్‌లో పలు ఐటీ కంపెనీలకు భూమి పూజ అనంతరం అక్కడి ఐటీ ఉద్యోగులతో లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి లోకేష్ మాట్లాడుతూ ఏపీని కాల్నిఫోర్నియా ఆఫ్ ఈస్ట్‌గా తీర్చిదిద్దుతామని, ఈ ప్రయాణంలో మీరందరూ భాగస్వామ్యం కావాలన్నారు. హైదరాబాద్ ఈ స్థాయికి రావడానికి 35 ఏళ్ల సమయం పడితే విశాఖ అభివృద్ధికి పదేళ్లు చాలన్నారు. చాలా మంది రాజకీయ నాయకులకు ఒక్క అవకాశమే వస్తుందని, తమకు విశాఖ, అమరావతిని అభివృద్ధి చేసేందుకు రెండు అవకాశాలు లభించాయని, ముస్ముందు విశాఖకు అనేక కంపెనీలు

తరలివస్తాయన్నారు. యువత భాగస్వా మ్యంతోనే భారతదేశం నెం.1 ఎకానమీగా రూపుదిద్దుకుంటుందన్నారు. మోదీ నేతృత్వంలో ప్రపంచంలో ఇండియా నెం.1 ఎకానమీగా రూపుదిద్దుకుం టుందన్నారు. అందరూ విశాఖపట్నం బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని, మీలో ప్రతి ఒక్కరూ మీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. విశాఖపట్నం పరిశుభ్రంగా, పచ్చగా ఉండాలని, మన నగరం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలవాలన్నారు. దానికోసం మన వంతు కృషి చేయాలన్నారు.

డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు డీఐజీ స్వాగతం

విశాలాంధ్ర – విశాఖ క్రైమ్: విశాఖపట్నం సిటీలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సు (సిఐఐ పార్ట్నర్షిప్ సమిట్) నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం విశాఖపట్నం వచ్చిన ఆంధ్రప్రదేశ్

రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. సదస్సు నిర్వహణలో తీసుకోవలసిన భద్రతా ఏర్పాట్లు, సమన్వయ చర్యలపై చర్చించారు.

సెయిల్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి లోకేష్ భూమి పూజ

విశాలాంధ్ర – కొమ్మాది: మధురవాడ ఐటి సెజ్ హిల్ నెం.3లో సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్ సాఫ్ట్ వేర్ ఇన్నొవేషన్ అండ్ ఎఐ ఎక్సలెన్స్ సెంటర్‌కు మంత్రి లోకేష్ భూమి పూజ గురువారం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ సెయిల్స్ సాఫ్ట్ వేర్ ఉద్యోగులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఇష్టపడి ఎంచుకున్న సాఫ్ట్వేర్ రంగానికి విశాఖలో ఉజ్వల భవిష్యత్తు ఉందని అందుకు అనుగుణంగా కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు రాబట్ట వచ్చని సూచించారు. సీఈఓ కిరణ్, ఏ.సంగీత్ మాట్లాడుతూ తమ కంపెనీలో ఇప్పటికే 350కు పైగా ఐటి నిపుణులకు ఉపాధి అవకాశాలు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, స్థానిక భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఐటీఈఎన్‌సి కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నని దర్శించుకున్న విదేశీ ప్రముఖులు

విశాలాంధ్ర–సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని వివిధ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఆలయ మర్యాదలతో ప్రముఖులను ఆహ్వానించారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని బేడా ప్రదక్షిణ చేశారు. పిదప స్వామివారికి తమ తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. డిఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మెక్సికోలోని అగ్వాస్కా లియంటెస్ రాష్ట్ర ఆర్థిక మంత్రి హెచ్.ఈ. మిస్టర్ ఎసావు గార్జా తన బృందంతో కలిసి సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. వారు సాంప్రదాయ దుస్తుల్లో స్వామివారిని దర్శించి, ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. స్పైసీ రాకెట్ సంస్థ సీఈఓ, అంతర్జాతీయ వక్త ఎవ్గే కోనెవ్, ఏపీఐఐసీ ఛైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. రెవెన్యూ విభాగం వీఆర్వో మణికంఠ తదితరులు వీరి వెంట ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర – పద్మనాభం: కొయ్య లలిత అనే ఆమె తన భర్త కొయ్య రామ్మోహన్ (65) కనిపించడం లేదని పోలీసు వారికి ఫిర్యాదు చేసింది. అయితే గురువారం తిమ్మాపురం బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పోలీసు వారికి సమాచారం తెలియగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భీమిలి మార్చురీలో భద్రపరచగా, కొయ్య లలిత కుటుంబ సభ్యులకు తెలియజేయగా వారు వచ్చి మార్చురీలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి అది తన భర్త కొయ్య రామ్మోహన్‌దే గుర్తించింది. మృతదేహాన్ని కొయ్య లలిత కుటుంబ సభ్యులకు అప్పజెప్పి, మిస్ అయిన వ్యక్తి మరణించినట్లుగా నమోదు చేశామని, ఈ కేసును మరిన్ని వివరాల కొరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసు వారు తెలియజేశారు.

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న ఆంధ్ర

మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఏర్పాట్లను మంత్రి కొలుసు పార్ధ సారధి గురువారం పరిశీలించారు. ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ సదస్సును విజయవంతంగా నిర్వహించుటకు మంచి ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. రాష్ట్రానికి సిఐఐ భాగస్వామ్య సదస్సుకి ముందు తరవాత అనే రీతిలో అభివృద్ధి జరుగుతోందన్నారు. సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబుపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం

ఏర్పడి 18 నెలల కాలంలో రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ సదస్సులో కనీసం 450 నుండి ఐదు వందల పెట్టుబడి ఒడంబికలు జరగనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రారంభించిన ఇళ్లకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన ఇళ్లను కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. మరికొద్ది నెలల్లో రెండో విడత మరిన్ని ఇళ్లకు గృహప్రవేశం చేస్తామని అన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర – భీమిలి: అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కార్యక్రమాన్ని అవంతి సెంట్రల్ లైబ్రరీలో ఈనెల 14 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలియజేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, వివిధ రకాలైన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ముగింపు ఉత్సవములో బహుమతులను ప్రధానం చేస్తామని చెప్పారు.

వీఎంఆర్డీఏ ప్రాజెక్టును సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర – విశాఖ : వీఎంఆర్డీఏకి చెందిన టీయూ 142 యుద్ధ విమాన మ్యూజియం, మాయా వరల్డ్, హెలికాప్టర్ మ్యూజియంలను గురువారం సాయంత్రం రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. మంత్రికి వాటి విశేషాలను వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ వివరించారు. కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టును వచ్చే శివరాత్రి నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని, దేశంలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జి ను కూడా త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విశాఖను పర్యాటకానికి చిరునామాగా తీర్చిదిద్దుతామని మంత్రికి వివరించారు. పర్యాటకులను ఆకర్షించేలా పలు ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువచ్చిన వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం. వి. ప్రణవ్ గోపాల్ ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ అధికారులు, సిబ్బంది, మాయా వరల్డ్ ప్రతినిధి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్ట్‌లో ముగిసిన నిఘా అవగాహనా వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో నిఘా అవగాహనా వారోత్సవాలు 2025 ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోర్ట్ చైర్ పర్సన్ డా. ఎం.అంగముత్తు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోర్ట్ ముఖ్య నిఘా అధికారి అరుణ్ ప్రసాద్ ముఖ్య అతిథులు, అధికారులను స్వాగతించి, వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన నిఘా అవగాహనా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. అంగముత్తు మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి, నిష్పాక్షికతతో పని చేయడం ద్వారా పోర్ట్, డిసిఐఎల్ సంస్థలు మరింత ఉన్నతస్థాయికి ఎదుగుతాయని పేర్కొన్నారు. నిఘా అవగాహనా వారోత్సవాలు 2025 సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ మరియు ఎలోక్యూషన్ వంటి వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులు, ఉద్యోగులకు చైర్మన్ బహుమతులు ప్రదానం చేశారు. పోర్ట్ , డిసిఐఎల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు నెలల విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (2025 ఆగస్టు 18 నుండి నవంబర్ 17 వరకు) లో భాగంగా, విశాఖపట్నంలోని పాఠశాలలు

కళాశాలల్లో అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుర్గేశ్ కుమార్ దూబే, డిప్యూటీ చైర్మన్, టి.వేణు గోపాల్, సెక్రటరీ, కెప్టెన్ ఎస్. దివాకర్, ఎండీ సిఈఓ (అడిషనల్ చార్జ్), డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, డిసిఐఎల్ నుండి సీనియర్ అధికారులు హాజరయ్యారు.

బ్రాండ్ ఇమేజ్‌తో పెట్టుబడుల వెల్లువ

గూగుల్, సీఐఐ సమ్మిట్ ఆహ్వాన సైకత శిల్పాన్ని సందర్శించిన గంటా

విశాలాంధ్ర – పీఎం పాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సీఐఐ సమ్మిట్.. గూగుల్ డేటా సెంటర్‌లను స్వాగతిస్తూ రుషికొండ బీచ్‌లో తయారు చేసిన సైకత శిల్పాన్ని గురువారం సందర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అయిదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రంలోని పరిశ్రమలను జగన్మోహన్ రెడ్డి తరిమేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అంతర్జాతీయ సంస్థలు రూ. లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు రావడం శుభసూచకమని పేర్కొన్నారు. సీఐఐ సమ్మిట్‌లో రూ.10 లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు జరగనున్నాయని అనేక మంది పెట్టుబడిదారులు తమ ఒప్పంద ప్రతిపాదనలకు సమ్మిట్‌లో చోటు కల్పించాలని ఇప్పటికీ కోరుతున్నారని వెల్లడించారు.

విశాఖకు వచ్చే పరిశ్రమల్లో అత్యధిక శాతం భీమిలి నియోజకవర్గంలోనే ఏర్పాటు కావడం పట్ల స్థానిక ఎమ్మెల్యేగా ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, ఏపీటీడీసీ ఆర్డీ కల్యాణి, జిల్లా టూరిజం అధికారి మాధవి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మీ, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, కె.అచ్యుతరావు, శాఖారి శ్రీనివాస్, దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన రాష్ట్ర డి.జి.పి

విశాలాంధ్ర – విశాఖ క్రైమ్: విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లను, కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను రాష్ట్ర డి.జి.పి శ్ హరీష్ కుమార్ గుప్తా, నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో సుమారు 2300 మంది (08 మంది ఐ.పి.ఎస్ అధికారులు, 08 మంది ఏ.డి.సి.పి లు, 32 మంది ఏ.సి.పి లు, 89 సీ.ఐలు, 192 ఎస్.ఐ లు, సుమారు 2000 (ఏ.ఎస్.ఐ, హెచ్.సి, పి.సి, హెచ్.జి) సిబ్బందితో సదస్సుకు పకడ్బంధీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. నిరంతర నిఘాతో, నగర ప్రజల భద్రతతో పాటుగా నగరానికి వచ్చు విదేశీ ప్రతినిధులకు, వి.ఐ.పిలకు, సదస్సులకు పూర్తి భద్రతా చర్యలు చేపట్టినట్టు వారు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే

ప్రతినిధులకు వసతి కల్పించే హోటళ్ల వద్ద స్నిఫర్ డాగ్ స్క్వాడ్లతో, బాంబు స్క్వాడ్లతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో సదస్సు చుట్టూ ప్రత్యేక నిఘా పెట్టడమే కాకుండా ఆర్.ఓ.పిలు, ఏ.ఎస్.సి టీంలతో నగరంలో వి.ఐ.పిలు, సదస్సుకు వస్తున్న ప్రతినిధులు ప్రయాణిస్తున్న రహదారులను అనుక్షణం తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు.

జాతీయ దత్తత మాసోత్సవాలు

విశాలాంధ్ర – ఆనందపురం: జాతీయ దత్తత మాసోత్సవాలలో భాగంగా గురువారం ఆనందపురం భీమిలి మండలంలో గల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 90 మంది స్వయం సంఘాల సభ్యులకు సమావేశం జరిగింది. దత్తత ప్రక్రియ, మిషన్ వాత్సల్య పథకం గురించి ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసి బి.మమత వివరించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, పిల్లలకు ఉన్న ప్రభుత్వ పథకాలు గురించి అప్ హెల్డ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్తేర్ రాణి, సూపర్వైజర్ జి. శిరీష, అంగన్వాడి వర్కర్ ఎం.సుగుణ, స్వయం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతా సాధనలో సెయింట్ ఆన్స్ కళాశాల అగ్రగామి

విశాలాంధ్ర – మల్కాపురం: మహిళా సాధికారతా సాధనలో మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాల అగ్రభాగంలో ఉందని ప్రముఖ సామాజిక కార్యకర్త మేరీ స్టెల్లా నారాయణ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల స్వర్ణోత్సవ బ్యానర్‌ను ఆమె ఆవిష్కరించారు. మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషించినప్పుడే దేశం త్వరితగతిని అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. 1976లో ప్రారంభమైన సెయింట్ ఆన్స్ కళాశాల పారిశ్రామిక ప్రాంతంలోని మొదటి మహిళా కళాశాల అని, గత 50 సంవత్సరాలుగా ఈ కళాశాల కొన్ని వేలమంది మహిళలను నాయకులుగా, వివిధ రంగాలలో నిపుణులుగా తయారు చేసిందని అన్నారు. సమావేశానికి కళాశాల డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షత వహించగా, కళాశాల పూర్వ ప్రిన్సిపల్స్ సిస్టర్ బెల్సి, సిస్టర్ క్రిస్టి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, ప్రస్తుత జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ తదితరులు సమావేశంలో మాట్లాడారు. అనంతరం స్వర్ణోత్సవ బ్యానర్‌ను మేళతాళాలతో, నృత్యాలతో ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినిలు, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

కామ్రేడ్ గుజ్జు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను కొనసాగిద్దాం

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర – తగరపువలస: సీపీఐ నేత, చిట్టివలస లేబర్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుజ్జు రామనాయుడు 41వ వర్థంతిని గుడివాడ గ్రామంలో ఏఐటీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శి, చిట్టివలస జ్యూట్ లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ పడాల రమణ కామ్రేడ్ రామ నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆనాడు జరిగిన శాసనసభ ఎన్నికల్లో మహారాజా పి విజి రాజుపై సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి అతి స్వల్ప ఓట్లతో ఓడిపోయినప్పటికీ గట్టి పోటీ ఇచ్చిన ప్రజా నేత కామ్రేడ్ రామానాయుడని కొనియాడారు. సీపీఐ సీనియర్ నాయకులు చిల్ల నరసింహ మాట్లాడుతూ కార్మికులు, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసి జైలు జీవితాన్ని కూడా అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుడివాడ గ్రామ పెద్దలు గుజ్జు ఎర్రయ్య, చిల్ల అప్పల రెడ్డి, చిల్ల అప్పలసూరి, రాంబాబు, వీర్రాజు, అప్పల నరసయ్య, చిల్ల రాంపైడి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

18న భవన నిర్మాణ కార్మిక ప్రాంతీయ సదస్సు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర – పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 18న విశాఖ నగరంలోని సీతంపేట బీవీకే కాలేజ్ పక్కన గల పౌర గ్రంథాలయంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ప్రజలు, కార్మికులకు పిలుపునిచ్చారు. జీవిఎంసీ 97వ వార్డు, పెందుర్తి మండలం, చిన్న ముసిడివాడ కార్మికుల సెంటర్లో గురువారం ఈ మేరకు ప్రచార సభ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996ను పటిష్ఠంగా అమలు చేస్తూ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి కార్మికుల కడుపులు కొట్టిందని అన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెండింగ్లో ఉన్న 46వేల క్లెయిమ్స్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై.బంగారు నాయుడు, అప్పలనాయుడు, పాపారావు జగదీష్, రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో బిజినెస్ క్లబ్ యాక్టివిటీస్‌పై పోటీలు

విశాలాంధ్ర – తగరపువలస: అవంతి విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో అవంతి ఇంజినీరింగ్ కళాశాల లో యం.బి.ఏ విద్యార్థులకు హెచ్ఓడి రాము (యం.బి.ఎ) ఆద్వర్యంలో కార్పోరేట్ సిమిలేషన్ ఎక్సర్సైజస్ తో పాటు జి.డి.యస్ మీద పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 80 మందికి పైగా విద్యార్థులు పది బృందాలు టీమ్‌గా ఏర్పడి పాల్గొన్నారు. యం.బి.ఎ ద్వితీయ సం.కి చెందిన హర్ష టీమ్ విజేతగా నిలవగా విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళీ కృష్ణ, డైరెక్టర్ డా.కే.చంద్రశేఖర్‌లు అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి 2
శుక్రవారం 14, నవంబర్ 2025

బీచ్ రోడ్ పారిశుధ్య పనులను పరిశీలించిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సిఐఐ భాగస్వామ్య సదస్సు కు విచ్చేయనున్న ప్రతినిధులకు, అతిథులకు ఆహ్లాదం కలిగించేలా బీచ్ ను సుందరంగా తీర్చిదిద్ది నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బీచ్ పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా నగరంలో సిఐఐ భాగస్వామ్య సదస్సుకు దేశ విదేశాల నుండి ఎంతోమంది అతిథులు, ప్రతినిధులు వస్తున్నందున బీచ్ పరిసరాలు, నిత్యం పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ

పరిశ్రమలు స్థాపనకు సీఎం సమక్షంలో తైవాన్ ప్రతినిధి బృందంతో ఎంవోయూలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని తైవాన్ ప్రతినిధి బృందానికి సీఎం తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా భారత్ లో తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని తైవాన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని సీఎం తైవాన్ బృందానికి వివరించారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తైవాన్ కంపెనీలను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో - తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్టు తెలిపింది. పాద రక్షల తయారీ కంపెనీ పౌ చెన్ గ్రూప్ ఫుట్ వేర్ యూనిట్ ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఒర్వకల్లులో ఇమేజ్ సెన్సార్ల ఉత్పత్తి చేసేందుకు తైవాన్ కు చెందిన క్రియేటివ్ సెన్సార్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించేందుకు సహకరించాలని కోరింది. ఒర్వకల్లు సమీపంలోనే ఇ-జౌల్ ఇండియా జాయింట్ వెంచర్ సంస్థ అడ్వాన్స్డ్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చింది. 2.2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ ప్రతిపాదించింది. వీటికి సంబంధించి సీఎం చంద్రబాబు సమక్షంలో తైవాన్ కంపెనీల ప్రతినిధులు-ఈడీబీ ఒప్పందాలు చేసుకున్నారు. తైవాన్ కంపెనీల ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కుకు భూములను కేటాయిస్తామని సీఎం స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులకు వివిధ రహదారులను అనుసంధానిస్తామని పేర్కొన్నారు. కర్నాటక, ఏపీ, తమిళనాడు రీజియన్లను కలుపుతూ ఈ రహదారి మార్గాలు ఉంటాయని తైవాన్ ప్రతినిధులకు వివరించారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ పాలసీలో భాగంగా ప్రోత్సాహకాలకు సంబంధించిన నిర్ణయాలు త్వరలోనే కేంద్రం విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. తైవాన్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తయారు చేసేందుకు సిద్ధమని సీఎం వెల్లడించారు. తైవాన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ సహకారం బాగుందని తైవాన్ బృందం కొనియాడింది.

ఇంధన రంగంలో భారీ పెట్టుబడులకు రీన్యూ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ డీకార్బనైజేషన్ సొల్యూషన్స్ కంపెనీ రిన్యూ ఎనర్జీ గ్లోబల్ కంపెనీ తాజా పెట్టుబడులకు సంబంధించి గురువారం విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలితో నాలుగు వేర్వేరు అవగాహన ఒప్పందాలపై కంపెనీ సంతకం చేసింది. ఈ అవగాహన ఒప్పందాలు సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన రంగంలో జాతీయ స్థాయికి ఎదగడానికి కట్టుబడి ఉందన్నారు. దీనిని ముందుకు తీసుకొని వెళ్లడంలో రీన్యూ

వంటి భాగస్వాములు కీలక పాత్ర పోషిస్తున్నారు అన్నారు. రీన్యూ కంపెనీ నిరంతర పెట్టుబడులు రాష్ట్ర విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభపై ప్రపంచ పారిశ్రామికుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తాయన్నారు. రీన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ రీన్యూ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో భారతదేశంలోని అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు ఏర్పాటునకు మే 2025లో రూ.22 వేల కోట్ల పెట్టుబడులను ప్రకటించిందన్నారు. దాన్లో 6 జీ డబ్ల్యూ పీ వీ ఇంగాట్ వేఫర్ ప్లాంట్, 2 జీ డబ్ల్యూ పంప్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కే టీ పీ ఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం మరియు పవన- సౌర మరియు సౌర బీఈఎస్ఎస్ హైబ్రిడ్ తో కలుపుకొని 5 జీ డబ్ల్యూ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడంలో పెట్టుబడి పెట్టాలని ప్రణాళికలు వేస్తున్నట్టు చెప్పారు.

న్యూ లైఫ్ పాఠశాలలో ఆరెంజ్ డే

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గొట్టిపల్లి గ్రామంలోని న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆరెంజ్ డే సెలబ్రేషన్స్ ఉత్సాహంగా నిర్వహించారు. ఎల్ కేజీ, యూకేజీ విద్యార్థులు ముద్దుముద్దుగా ఉపన్యాసాలు చెప్పి, చిలిపి మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన డాన్సులు కార్యక్రమానికి విశేష ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పిల్లల ప్రదర్శనలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అధినేత, కరస్పాండెంట్ జయ శ్యామ్, ప్రిన్సిపాల్ కె.రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయశ్యామ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ చూసి ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యాయామం కూడా జీవితంలో ఎంతో ముఖ్యం అని సూచించారు. ప్రిన్సిపాల్ కె.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడమే ఇలాంటి వేడుకల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు లక్ష్మీ, సరోజ, పద్మ, రేఖ, సునీత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐఐ సమ్మిట్ ని స్వాగతిస్తున్నాం : ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖలో జరుగబోయే సిఐఐ సమ్మిట్ ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రియాంక దండి ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సులో సుమారు 9.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరగవచ్చని అంచనాలు ఉన్నాయని, ఆచరణలోకి వస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని, ఎందరికో ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషిని అభినందిస్తున్నామని ప్రియాంక అన్నారు.

ఇమామి కేశ్ కింగ్ గోల్డ్ పరిచయం

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారత్ యొక్క ప్రాముఖ్యత పొందిన ఒక హెయిర్ కేర్ బ్రాండ్ కేశ్ కింగ్ బ్రాండ్ తనకు తానే ఒక సరికొత్త రూపాన్ని ఇవ్వడానికి రీ బ్రాండింగ్ చొరవలో ప్రథమాంశంగా కేశ్ కింగ్ గోల్డ్ ను ప్రవేశపెట్టింది. దీనివలన బ్రాండ్ కు ఒక కొత్త గుర్తింపు, ప్రతిపాదన, ప్యాకేజింగ్ కు ఒక సరికొత్త ఆకర్షణీయమైన స్థానం పొందిందని ఆ సంస్థ ప్రతినిధి ప్రీతి ఎ సురేఖ చెప్పారు. ఈ రీ బ్రాండింగ్ చొరవ కారణంగా ఇమామి తన బ్రాండ్ కేశ్ కింగ్ కోసం ఒక ప్రత్యేక వ్యూహాత్మక మార్పును స్వీకరించిందన్నారు. ఇప్పుడు అది దాని సాంప్రదాయ మూలాలను దాటి ఒక శక్తివంతమైన కొత్త ప్రతిపాదన స్వీకరించిందని, ఆయుర్వేదం ప్లస్ విజ్ఞానం దీంతో అందుతుందన్నారు. గ్రో బయోటిన్ మరియు ప్లాంట్ ఒమేగా 3 6-9 అనే ప్రముఖ వైజ్ఞానిక శక్తివంతమైన క్రియ కలిగిన మూలపదార్థాలతో 21 నమ్మకమైన ఆయుర్వేద వివిధ మూలికల తత్వాలతో జుట్టు పెరుగుదల, జుట్టు రాలిపోవడాన్ని అరికట్టడానికి క్లినికల్లీ సర్టిఫికెట్ పొందిందని చెప్పారు.

ఘనంగా బంగారమ్మ తల్లి రథోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభ మండలం పాండ్రంగి పంచాయతీలో గురువారం శ్రీ బాణి జన సందోహం మధ్య అంగరంగ వైభవంగా శ్రీ బంగారమ్మ తల్లి రథోత్సవం కార్యక్రమం ఘనంగా స్థానిక

గ్రామస్తులు నిర్వహించారు. ముందుగానే పెద్దలకు సమక్షంలో నిర్ణయించబడిన ఈ పండగ ప్రతి ఏడాది దీపావళి, నాగుల చవితి అయిన తర్వాత వచ్చే పౌర్ణమి సందర్భంలో అమ్మవారి పండుగను చేస్తారు. అమ్మవారి పండగ ముందు వచ్చే ఆదివారం మరిడి మొక్కడం, సోమవారం దేవర ఋణారాలు తోలెక్కు గురువారం అమ్మవారి రథోత్సవం తో అమ్మవారి పండగ ముగుస్తుంది. గురువారం పంచాయితీ పరిధిలో ఉన్న మధుర గ్రామాల నుంచి వచ్చిన భక్తులే కాకుండా ఇతర పంచాయతీలు, మండలాల నుంచి కూడా భక్తులు వచ్చి విశేషంగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేసుకుని మొక్కులను చెల్లించడం జరిగింది. ఈ అమ్మవారు పండగ మహోత్సవం, ఉత్సవ కమిటీ, స్థానిక గ్రామ పెద్దలు నాయకులు సమక్షంలో నిర్వహించబడుతుంది.

పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవం

విశాలాంధ్ర - విశాఖపట్నం: పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవాలను స్థానిక ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, జీ ఎం ఆర్ వరలక్ష్మి క్యాంపస్ నవంబర్ 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పిల్లలలో సంభవించు వివిధ రకాల నేత్ర వ్యాధుల పట్ల అవగాహన కలిగించు పలు కార్యక్రమాలను చేపట్టారు. భారతదేశంలో ముఖ్యంగా పిల్లలలో మయోపియా వేగంగా పెరుగడం పైన వారు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకనే ఈ వారోత్సవాలను " మయోపియా అవగాహన" ఇతివృత్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వారోత్సవాల సందర్భంగా జీ ఎం ఆర్ వరలక్ష్మి క్యాంపస్ నందలి ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వద్ద రోగులకు మరియు సిబ్బంది పిల్లలకు పలు రకాల పోటీలు మరియు వినోదభరిత సరదా కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, బహిరంగ ఆటలు, మయోపియా క్విజ్, డ్యాన్స్ పోటీలు వంటివి నిర్వహించారు. 13 నవంబర్ 2025న బాలల దినోత్సవం క్యాంపస్ నందు అవగాహన సదస్సు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్, జిల్లా అంధత్వ నియంత్రణ సంఘం %c% సూపరింటెండెంట్ డాక్టర్ వి. మీనాక్షి పాల్గొన్నారు. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ క్యాంపస్ హెడ్ డాక్టర్ వీరేంద్ర సచ్ దేవా అన్నారు.

టీడీపీ 6వ వార్డు అధ్యక్షుడుగా గరే గురునాథ్

విశాలాంధ్ర - కొమ్మాది: భీమిలి నియోజకవర్గం జీవీఎంసీ ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడుగా కెవిఆర్ క్యాటరింగ్ అధినేత గరే గురునాథ్‌ను పార్టీ నియమించింది. ఇటీవల టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలను నియమించింది. ఆ నేపథ్యంలో గురువారం సింహాచలంలో మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు అధ్యక్షతన, చిక్కాల విజయబాబు ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గంలో ఉన్న 1 నుండి 8 వార్డులు అలాగే 98వ వార్డుల వారిగా తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసి ఆరో వార్డు నూతన కమిటీలో అధ్యక్షుడుగా గరే గురునాథ్, ఉపాధ్యక్షుడిగా వరుపుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా లొడగల జానకి రామ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బన్నరాశివ ప్రసాద్ రావు, పోతిన శ్రీనివాస రావు,నొడగల రామశేఖర్, కార్యదర్శులుగా తిరుమలరాజు వర్మ, అలాలని సూరిబాబు, గిడిజాల పార్వతీశం, కోశాధికారిగా కొరగంజి సూరిబాబులను పార్టీ నియమించింది. ఈ సందర్భంగా ఆరో వార్డు అధ్యక్షుడు గరే గురునాథ్ మాట్లాడుతూ ఆరవ అధ్యక్షుడుగా బాధ్యతలు అప్పజెప్పిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, యువ నాయకులు గంట రవితేజ, చిక్కాల విజయబాబులకు ముందుగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన పదవీ బాధ్యతలతో ప్రజలకు పార్టీకి మరింత సేవ చేసుకునే భాగ్యం లభించిందని గరే గుర్నాథ్ తెలిపారు.

మెడికవర్ ఆసుపత్రిలో సమర్థవంతమైన నొప్పి ట్రీట్మెంట్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని మెడికవర్ ఆసుపత్రుల్లో నొప్పిని సమర్థవంతంగా అదుపుచేసే చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి సీనియర్ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ కె.వి.డి.ప్రవీణ్ తెలిపారు. నగరంలోని అరిలోవ మెడికవర్ క్యాన్సర్ ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నొప్పి అనేది కేవలం శారీరక అసౌకర్యం మాత్రమే కాదని, అది మన మనసును, మన జీవనశైలిని పూర్తిగా ప్రభావితం చేసే సమస్యన్నారు. దీర్ఘకాలిక నొప్పి కారణంగా అనేక మంది తమ రోజువారీ పనులు, నిద్ర, కుటుంబ జీవితం అన్నీ కోల్పోతున్నారన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ, నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా సరైన చికిత్స తీసుకోవాలనే సందేశంతో తాము ఆధునిక నొప్పి చికిత్సపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తున్నా మన్నారు. నొప్పి అనేది శరీరం పంపే హెచ్చరిక సంకేతమన్నారు. దాన్ని పట్టించుకోకపోతే అది దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది. సరైన వైద్య నిపుణుడిని సంప్రదిస్తే మళ్లీ సాధారణ జీవితాన్ని

సులభంగానే పొందవచ్చన్నారు. పెయిన్ ఫిజీషియన్లు కేవలం మందులు మాత్రమే కాకుండా, నొప్పి మూలకారణాన్ని గుర్తించి, దానిని శాశ్వతంగా తగ్గించే ఆధునిక చికిత్సలు అందిస్తారన్నారు. ఈ మీడియా సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ కిషోర్, డాక్టర్ సృజన, డాక్టర్ రోజాలిన్, డాక్టర్ ఇంగ్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - పీఎం పాలెం : ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ కంపెనీ నిర్మాణానికి విశాఖ ఐటి హిల్ నెం.2లో మంత్రి లోకేష్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా లోకేష్ సెయిల్ సాఫ్ట్ వేర్ ఉద్యోగులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఇప్పుడే ఎంచుకున్న సాఫ్ట్వేర్ రంగానికి విశాఖలో ఉజ్వల భవిష్యత్తు ఉందని అందుకు అనుగుణంగా పెట్టుబడి పెడితే మంచి ఫలితాలు రాబట్ట వచ్చని సూచించారు. కంపెనీ నిర్వాహకులకు అవసరమైన సహాయ సహకారాలు అందివ్వడానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరలో నూతన భవనాన్ని పూర్తిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ కంపెనీ ఇండియా ఎస్ వి పి హెడ్ రమేష్ మద్దుకూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్ మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటి సొల్యూషన్స్, ఐటిఇ సేవల డెలివరీ కార్యకలాపాలు నిర్వహిస్తుందని చెప్పారు.ఎఐ, ఆటోమేషన్-ఎనేబుల్డ్ బిపిఓ/ కే పి ఓ సామర్థ్యాలతో హెల్త్‌కేర్ ఐటిఈఎస్ సేవల డెలివరీ, ఏజెంట్ ఏఐ ,జనరేటివ్ ఏఐ సొల్యూషన్స్ పై దృష్టి సారించి, విశాఖలో ఆర్ అండ్ డి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇక్కడ నూతన కంపెనీలో సుమారు 2000 వేల మంది ఐటీ నిపుణులు ఉపాధి పొందనున్నారని రమేష్ మద్దుకూరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక

భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఐటిఈఎస్ సి కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ డాట్ ఇన్ లో అగ్రగామి పుస్తకాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: బాలల దినోత్సవం నాడు, అమెజాన్ డాట్ ఇన్ కుతూహలం కలిగించి, సృజనాత్మకతను ప్రోత్సాహం చదానికి, చదవడం పట్ల ప్రేమను పెంచడానికి అత్యంత ప్రసిద్ధి చెందిన పుస్తకాల యొక్క కూర్పు చేసిన ఎంపికను తీసుకువస్తోంది. శాశ్వతమైన క్లాసిక్స్ నుండి సాహసోపేతమైన కథలు, విద్యాపరమైన పుస్తకాలు వరకు, కస్టమర్లు బెస్ట్-సెల్లింగ్ రచయితలు యొక్క ప్రచురణకర్తల్లో విస్తృత శ్రేణి టైటిల్స్ ను అన్వేషించవచ్చు. కస్టమర్లు 45 శాతం వరకు కూడా తగ్గింపు, అదనంగా 10 శాతం తక్షణ బ్యాంక్ డిస్కౌంట్ ను కెనరా బ్యాంక్ క్రెడిట్ కార్డ్ లావాదేవీలపై పొందవచ్చు. అమెజాన్ లో ద కిడ్ హు కేమ్ ఫ్రమ్ స్పేస్, డైరీ ఆఫ్ ఏ వింపీ కిడ్, ఇట్స్ టైమ్ టు సే గుడ్ నైట్, ద మేజిక్ ఆఫ్ ద లాస్ట్ టెంపుల్, హ్యారీ పాటర్, తెలుగు లాంగ్వేజ్ ప్యాక్, గ్రేట్ బాల్ కహనియాన్, ద పంచతంత్ర ఆఫ్ విష్ణు శర్మ (ఒడియా), కిండర్ సీరీస్ కన్నడ తదితర ప్రాముఖ్య పుస్తకాల శ్రేణి అందుబాటులో ఉందని అమెజాన్ డాట్ ఇన్ ప్రతినిధి చెప్పారు.

అగ్రశ్రేణి క్రియేటర్లతో ప్రత్యేక ఒప్పందాన్ని కుదుర్చుకున్న శామ్‌సంగ్ టీవీ ప్లస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: శామ్‌సంగ్ టీవీ ప్లస్, భారతదేశంలోని అగ్రగామి ఉచిత ప్రకటన ఆధారిత స్ట్రీమింగ్ టెలివిజన్ (ఫాస్ట్) సేవ, ఇప్పుడు ప్రపంచంలోని అగ్ర సృష్టికర్తలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, వారి ప్రత్యేక ఎఫ్ ఏ ఎస్ టీ ఛానెల్ ను నేరుగా ఇండియాలో పెద్ద తెరపై తీసుకువస్తోంది. భారతదేశంలో ప్రారంభించిన ఆరు ప్రత్యేకంగా ఎంపిక చేసిన ఛానెల్లలో, మార్క్ రాబర్ యొక్క మొట్టమొదటి ఉచిత ప్రకటన ఆధారిత స్ట్రీమింగ్ టీవీ ఛానెల్ ప్రపంచ ప్రీమియర్ కూడా ఉంది. ప్రస్తుతం, శామ్‌సంగ్ టీవీ ప్లస్ 160కి పైగా ఛానెళ్లను అందిస్తూ, దేశవ్యాప్తంగా 14 మిలియన్లకు పైగా శామ్‌సంగ్ స్మార్ట్ టీవీలలో అందుబాటులో ఉంది. 71 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లను కలిగిన మార్క్ రాబర్ మాజీ నాసా ఇంజనీర్, ఆవిష్కర్త, విద్యావేత్త ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన సృష్టికర్తలలో ఒకరు ఇప్పుడు టెలివిజన్ ప్రేక్షకులకు శాస్త్రం, సృజనాత్మకత మరియు వినోదం కలగలిసిన అనుభవాన్ని అందిస్తున్నామని మార్క్ రాబర్ అన్నారు.

బజాజ్ ఫిన్సర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: బజాజ్ ఫిన్సర్వ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టే ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ పథకం అయిన బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ ను ప్రారంభించినట్టు ప్రకటించింది. న్యూ ఫండ్ ఆఫర్ 10 నవంబర్ 2025న సబ్ స్క్రిప్షన్ కోసం తెరుచుకుంది. 24 నవంబర్ 2025న ముగుస్తుంది. భారతదేశం యొక్క బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగం

BAJAJ MUTUAL FUND

అపూర్వమైన వేగంతో రూపాంతరం చెందుతోందని బజాజ్ ఫిన్సర్వ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్ మోహన్ తెలిపారు. భారతదేశం వికసిత్ భారత్ వైపు కదులుతున్నప్పుడు మరియు ప్రపంచవ్యాప్తంగా టాప్ 3 ఆర్థిక వ్యవస్థగా అవతరించినప్పుడు, ఈ వృద్ధిని ప్రారంభించడంలో ఆర్థిక సేవల రంగం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. థీమాటిక్ ఫండ్ ద్వారా ఈ మెగాట్రెండ్ లో పాల్గొనే అవకాశాన్ని పెట్టుబడిదారులకు ఇస్తుందన్నారు.

రోడ్ సేఫ్టీ కిడ్స్ కార్నివాల్ లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు వైజాగ్ లోని సేఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ లో హీరో మోటార్ సైకిల్ హట్‌స్టార్ ఇండియా రోడ్ సేఫ్టీ కిడ్స్ కార్నివాల్ లో పాల్గొని, ఆకర్షణీయమైన కార్యకలాపాల ద్వారా సురక్షితమైన రోడ్డు అలవాట్ల గురించి తెలుసుకున్నారు.

మాతృభాషలో ప్రాథమిక విద్య మా బిడ్డల హక్కు

- నాలుగవ రోజు "టిట్టిభ సత్యాగ్రహం"లో వక్తలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మాతృభాషలో ప్రాథమిక విద్య మా బిడ్డల హక్కు అని నాలుగవ రోజు "టిట్టిభ సత్యాగ్రహం"లో పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం తెలుగు దండు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టిట్టిభ సత్యాగ్రహం గురువారం నాలుగవ రోజు పలువురు భాషాభిమానులు, కవులు, కళాకారులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి మాట్లాడుతూ విదానికలంగా ఈ కూటమి ప్రభుత్వం తెలుగుభాష రక్షణ విషయంలో మీనమేషాలు లెక్కిస్తుందని, రాజకీయ రంగులు వేసి కార్పోరేషన్లను సృష్టించి కాలక్షేపం చేస్తోందని ఆరోపించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి పట్టుకొమ్మవంటి "మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ" ఊసెత్తడంలేదని ధ్వజమెత్తారు. నిరసన దీక్షకు సంఘీభావం తెలిపిన పలువురు కళాకారులు మాట్లాడుతూ... ఆంగ్లభాషకు మనం వ్యతిరేకం కాదు, కానీ అమ్మభాషకు అన్యాయం జరిగితే సహించబోమని ప్రతిజ్ఞ చేశారు. తెలుగుభాష ప్రాతిపదికనే ఏర్పడిన ఈనేలపై కళలు వర్ధిల్లుతాయని, కళాకారులకు జీవనోపాధి దొరుకుతుందని, కూటమి ప్రభుత్వం తెలుగుభాషను రక్షించి భావితరాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డి.వి.సూర్యారావు, కొచ్చెర్లకోట సత్యనారాయణ మూర్తి, రాజమన్నార్,జె.టి.రామారావు, రవిమోహన్, గిరిబాబు, శివజ్యోతి, నాగేంద్ర మణి, విలూరి లక్ష్మీ, బాదం మణికుమారి, సన్నాని రావు, బాబూరావు,అల్లు వెంకటరమణ, దప్పు సముద్రం,అనూషారాణి, సంధ్యా ప్రియదర్శిని పాల్గొన్నారు.